క్లుప్తంగా

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు


మోటార్లకు మరమ్మతులు చేయిస్తున్న సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య

మంత్రాలయం రూరల్: మంత్రాలయంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య తెలిపారు. మంగళవారం స్థానిక రాఘవేంద్ర నగర్‌లో గత మూడు రోజుల క్రితం మరమ్మతులకు గురైన మోటారును బాగు చేయించారు. అదే విధంగా సూగూరు మంచి నీటి పైప్‌లైన్, మోటార్లను పరిశీలించి నీటి సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచన మేరకు గ్రామంలో నీటి ఎద్దడి లేకుండా పలు చోట్ల మరమ్మతులకు గురైన మోటార్లను బాగు చేయించినట్లు సర్పంచ్ పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకుని వస్తే వెంటనే పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

శ్రీశైలానికి తరలివెళ్లిన కర్ణాటక భక్తులు


తరలివెళుతున్న భక్తులు

కౌతాళం: ఉగాది పర్వదినం పురస్కరించుకుని శ్రీశైల మల్లికార్జున స్వామి వారి దర్శనం కోసం కర్ణాటక భక్తులు మంగళవారం కౌతాళం మీదుగా పాదయాత్రగా తరలివెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కర్ణాటక రాష్ట్రం బిజాపూర్ జిల్లా నుంచి తాము గత 20 ఏళ్లుగా శ్రీశైల మల్లికార్జున స్వామి దర్శనానికి వెళుతున్నట్లు తెలిపారు. ఉగాది పర్వదినం సమయంలో పాదయాత్రగా వెళ్లి స్వామి దర్శనం చేసుకుంటే అంతా మంచి జరుగుతుందని, ఆ స్వామి ఆశీస్సులు తీసుకున్న తర్వాతే కుటుంబంలో అన్ని కార్యాక్రమాలు నిర్వహిస్తామని భక్తురాలు మల్లమ్మ తెలిపింది.

ఏకాగ్రతతో చదివితే మెరుగైన ఫలితం


కడివెళ్ల గ్రామంలో నైట్‌విజన్‌లో పదో తరగతి విద్యార్థిని కళ్యాణికి సూచనలిస్తున్న ఏపీసీ

ఎమ్మిగనూరుటౌన్: ఏకాగ్రతతో చదివితే పది పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సమగ్రశిక్ష ఏపీసీ వేణుగోపాల్ సూచించారు. నైట్‌విజన్‌లో భాగంగా బుధవారం రాత్రి కడివెళ్ల గ్రామంలో పదవ తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. కళ్యాణి అనే విద్యార్థినితో పదో తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న ప్రక్రియ గురించి అడిగి తెలుసుకున్నారు. పరీక్షలంటే భయంవీడి ఏకాగ్రతతో చదవాలని సూచించారు. సమగ్ర శిక్ష ప్లానింగ్ కో–ఆర్డినేటర్ మారుతి, ఏఎల్ఎస్‌ఓ కో–ఆర్డినేటర్ శ్రీనివాసులు, సీఆర్పీ రంగన్న తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి కబడ్డీ పోటీలు

తుగ్గలి: ఉగాది పండుగ పురస్కరించుకొని ఈనెల 21 నుంచి 22వ తేదీ వరకు కడమకుంట్లలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ గౌరవ సలహాదారు సుల్తాన్ తెలిపారు. పోటీలలో గెలుపొందిన జట్లకు వరుసగా సయ్యద్ సుల్తాన్ రూ.20 వేలు, షేక్ చిట్టి మస్తాన్ రూ.15 వేలు, కొండ వెంకటరాముడు, లంకాయపల్లి సురేష్, రూ.10 వేలు, అంగడి చిన్న బాషా రూ.5 వేలు నగదు బహుమతి అందజేస్తారన్నారు. వివరాలకు7780248219, 9100549910 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

వలసలు నివారించేలా ఉపాధి పనులు


నార్లాపురం పరిధిలో చెక్‌డ్యాం పూడికతీత పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి

వెల్దుర్తి: వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని కూలీలకు ఉపాధి పనులతో ఊరట లభిస్తుందని, వలసల నివారణ సాధ్యమౌతుందని, వీలైనంత ఎక్కువ మందికి ఎక్కువ పనులు కల్పిస్తామని డ్వామా పీడీ అమర్‌నాథ్ రెడ్డి స్పష్టం చేశారు. మండల పరిధిలోని బొమ్మిరెడ్డిపల్లె, నార్లాపురం పరిధిలో రూ.7.25 లక్షల అంచనాతో చేపట్టిన చెక్‌డ్యాం పూడికతీత పనులను ఆయన మంగళవారం పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. వేసవిలో తీసుకోవలసిన జాగ్రత్తలను వివరిస్తూ తెల్లవారుజామునే పనికి వచ్చి నాలుగు గంటలపాటు పనులు చేసుకుని వెళ్లాలన్నారు. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున కూలీలకు 100 పనిదినాలు పూర్తయ్యేలా, ప్రతి రోజు వేతనం రూ.250 కు తగ్గకుండా ఉండేలా చూసుకోవాలని ఏపీఓ రాజునాయక్‌ను ఆదేశించారు. టీఏ శ్రీనివాసరావ్, ఎఫ్ఏ రాజేశ్ ఉన్నారు.

డుమ్మా కొడితే అమ్మకు మెసేజ్

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరుపై పర్యవేక్షణ
- రోజూ పాఠశాలకు వెళ్లేలా హాజరు మెసేజ్ అలర్ట్
- ప్రభుత్వ చర్యలపై తల్లిదండ్రుల హర్షం

ఆదోని అర్బన్: పాఠశాలకు వెళ్లే విద్యార్థుల హాజరు పెంచేలా ప్రభుత్వం తాజాగా అమలు చేసిన మొబైల్ అలర్ట్ సందేశం విధానానికి మంచి స్పందన లభిస్తోంది. నాడు–నేడుతో ఇప్పటికే కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడుల రూపురేఖలు మారిపోయాయి. విద్యార్థులకు అవసరమైన సామగ్రిని సమకూర్చి మెనూ ప్రకారం రోజూ మధ్యాహ్న భోజనం అందిస్తోంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందించి బైజూస్ కంటెంట్‌తో బోధన ప్రారంభించింది. తాజాగా విద్యార్థులు సక్రమంగా పాఠశాలకు వస్తున్నారా? లేదానన్న అంశంపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం పంపేలా చర్యలు తీసుకుంది.

పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులకు ఇక చెక్ పెట్టినట్లే. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మొబైల్ అలర్ట్ సందేశంతో తల్లిదండ్రులు పిల్లలను గాడిలో పెడుతున్నారు. ఆదోని నియోజకవర్గంలో 132 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. అందులో 29,482 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ విద్యార్థులంతా వంద శాతం హాజరై తద్వారా అమ్మ ఒడి పథకాన్ని అందుకోవాలన్న ఉద్దేశంతో ఈ విధానానికి ప్రభుత్వం రూపకల్పన చేసింది. కొన్ని సందర్భాల్లో పిల్లలు ఇంటి నుంచి పాఠశాలకు వెళ్తున్నామని చెప్పి డుమ్మా కొడుతుంటారు. ఇలాంటి సందర్భంలో విద్యార్థి పాఠశాలకు హాజరుకాలేదంటూ వారి తల్లిదండ్రుల మొబైల్‌కు సందేశం వెళుతుంది. ప్రభుత్వం కొత్తగా అమలుచేసిన ఈ విధానంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పాఠశాలలోని విద్యార్థులు

సమయం దాటినా రాకుంటే...

విద్యార్థులు ఉదయం 10:30 గంటల్లోపు పాఠశాలకు హాజరుగాకపోతే మీ అమ్మాయి, అబ్బాయి ఈ రోజు పాఠశాలకు హాజరుకాలేదంటూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ పేరుతో ఆయా తల్లిదండ్రులకు నేరుగా మొబైల్‌కు సందేశం చేరుతుంది. దీని కోసం ముందుగా విద్యార్థుల తల్లిదండ్రులు లేదా సంరక్షకుడి మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌ను సేకరించి సీఎస్ఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచారు. వరుసగా మూడు రోజులపాటు పాఠశాలకు హాజరుగాకపోతే తల్లిదండ్రులతో పాటు ఆ ప్రాంత గ్రామ వలంటీర్, సచివాలయ వెల్ఫేర్ సహాయకుడికి ఈ మెసేజ్ చేరుతుంది. దీంతో వలంటీర్, వెల్ఫేర్ అసిస్టెంట్ హెచ్ఎంతో కలిసి విద్యార్థి ఇంటికెళ్లి పాఠశాలకు ఎందుకు రావడంలేదన్న విషయాన్ని అడిగి తెలుసుకుంటారు. ఇలా రూపొందించిన ఈ పథకం సత్ఫలితాలను ఇస్తోంది. ఈ కారణంగా బడిబయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. విద్యారంగంపై ప్రభుత్వం శ్రద్ధ వహిస్తుందనేందుకు ఇదే నిదర్శనమని తల్లిదండ్రులు చెబుతున్నారు.

చాలా మంచి విధానం



విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే వారి తల్లిదండ్రుల ఫోన్‌కు సమాచారం చేరవేసే విధానం ఎంతో మంచిది. దీనివల్ల పాఠశాలలో వంద శాతం హాజరు అమలవుతుంది. కొన్ని సందర్భాల్లో విద్యార్థి పాఠశాలకు వెళ్లకుండా ఉంటే తల్లిదండ్రులకు వెంటనే తెలుస్తోంది. బాలికల విషయంలో ఈ విధానం ఎంతో ఉపయోగకరం. విద్యార్థుల విద్యపై శ్రద్ధ చూపుతున్న ప్రభుత్వం పట్ల ప్రజల్లో నమ్మకం ఏర్పడింది.

– నాగరాజు, పేరెంట్స్ కమిటీ మెంబర్

పూర్తిస్థాయిలో హాజరు శాతం

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం ఆన్‌లైన్ అటెండెన్స్ అమలు చేస్తోంది. ఇప్పుడు విద్యార్థులు పాఠశాలకు వెళ్లకపోతే తల్లిదండ్రులకు సందేశం వెళ్లే కొత్త విధానాన్ని తీసుకొచ్చింది. దీని వల్ల హాజరు శాతం మెరుగవుతోంది. విద్యార్థులు పాఠశాలకు ఎందుకు రాలేదో వెంటనే తెలుస్తోంది. బడిబయట పిల్లలు మళ్లీ బడికి వస్తున్నారు.

– శివరాములు, ఎంఈఓ

రోడ్డు ప్రమాదంలో బావబామ్మర్ది దుర్మరణం



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోడేలు వెంకటేశ్వర్లు, పులి వెంకటేశ్వర్లు

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు మండలం వెంకాయపల్లె రోడ్డులోని ఎస్ఎస్ గార్డెన్ ఎదురుగా మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నంది కొట్కూరు నియోజకవర్గ పరిధిలోని కొణిదెల గ్రామానికి చెందిన తోడేలు మల్లికార్జున (30), పులి వెంకటేశ్వర్లు (28) ఇద్దరు మృతి చెందారు. కొణిదెల గ్రామానికి చెందిన పాండు కుమారుడు మల్లికార్జున బట్టల షాపులో గుమస్తాగా పనిచేసేవాడు. అదే గ్రామానికి చెందిన పెండయ్య కుమారుడు వెంకటేశ్వర్లు జేసీబీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. వీరివురు వరుసకు బావాబామర్దులు. బంధువులు వెంకాయపల్లె ఎల్లమ్మతల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేస్తుండడంతో హాజరయ్యారు. అనంతరం కొణిదెలకు తిరిగి వెళ్తుండగా ఐషర్ వాహనాన్ని ఢీకొట్టారు. గాయపడిన వీరివురిని కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందారు. తోడేలు మల్లికార్జునకు భార్య, ఓ కుమారుడు సంతానం. పులి వెంకటేశ్వర్లుకు భార్య, కుమారుడు, కుమార్తె సంతానం. సంఘటన స్థలానికి చేరుకున్న కర్నూలు అర్బన్ తాలుకా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హెచ్3ఎన్2 వ్యాధిపై అవగాహన

ఆదోని అర్బన్: ఇండియన్ మెడికల్ అసోసియేషన్, లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలో హెచ్3ఎన్2 వ్యాధి నివారణపై సభ్యులు అవగాహన కల్పించారు. ఈ మేరకు అసోసియేషన్ సెంట్రల్ వర్కింగ్ కమిటీ మెంబర్ డాక్టర్ గోపీనాథ్, పట్టణాధ్యక్షులు డాక్టర్ ఉషారావు, సభ్యులు డాక్టర్ హరీష్, రఘునాథ్ పాల్గొని మాట్లాడారు. దేశంలో హెచ్3ఎన్2 కాస్త ఎక్కువగా ఉందని, ఇది వైరస్ వ్యాధి అని, ప్రమాదకరమైన వ్యాధి కాదని సూచించారు. మామూలుగా జ్వరం, దగ్గు, జలుబు, గొంతునొప్పి, విరేచనాలు, ఆయాసం వంటి లక్షణాలతో వస్తుందన్నారు. జ్వరం ఆరు రోజులు, దగ్గు రెండు వారాల దాకా ఉంటుందని, దీనిపై భయపడాల్సిన అవసరం లేదన్నారు. జ్వరానికి పారాసిటమాల్ వేసుకోవాలని, ఆయాసం, దగ్గు ఎక్కువగా ఉంటే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఒకరిద్వారా మరొకరికి గాలిలో వ్యాప్తి చెందుతుందని, దీని నివారణకు ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలన్నారు. జన సమూహాల్లోకి వెళ్లరాదని, ఎక్కడ పడితే అక్కడ ఉమ్మి వేయరాదన్నారు. దగ్గడం, తుమ్మడం వస్తే చేతులు, రుమాలు అడ్డుపెట్టుకోవాలని సూచనలు ఇచ్చారు. అనంతరం మాస్కులు పంపిణీ చేసి, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కరపత్రాలను పంపిణీ చేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు ధర్మారెడ్డి, ప్రసాద్‌రావు, వనపరాజు, గోవిందరాజు, గోవిందరావు పాల్గొన్నారు.


వ్యాధిపై అవగాహన కల్పిస్తూ మాస్కులను అందజేస్తున్న లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్

ఉత్సవాల విజయవంతంపై హర్షం

ఆదోని రూరల్: మండలంలోని సంతెకూడ్లూరు గ్రామంలో రతీమన్మథ ఉత్సవాలు మూడు రోజుల పాటు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఇస్వీ పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేసి దిగ్విజయం చేశారు. ఈ మేరకు మంగళవారం రాత్రి స్థానిక రతీమన్మథుల ఆలయంలో గ్రామపెద్దలు పోలీసులకు శాలువా, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. గ్రామానికి సంబంధించిన కానిస్టేబుల్ నీలకంఠ ప్రజలకు అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తూ నిక్కచ్చిగా విధులు నిర్వర్తించడంతో గ్రామపెద్దలు, ఎంపీపీ బడాయి దానమ్మ, మాజీ ఎంపీపీ పంపాపతి, తాలూకా సీఐ మహేశ్వరరెడ్డి, ఎస్ఐ విజయలక్ష్మి తదితరులు సన్మానించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఆంధ్ర–కర్ణాటక సరిహద్దులో ఉన్న సంతెకూడ్లూరులో రతీమన్మథుల వేడుకలను ప్రశాంతంగా చేపట్టడంపై హర్షం వ్యక్తం చేశారు.


గ్రామ కానిస్టేబుల్ నీలకంఠను సన్మానిస్తున్న తాలూకా సీఐ, గ్రామపెద్దలు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి, సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు గ్రామానికి చెందిన శివ ఆటోలో బంధువులను కప్పట్రాళ్ల వద్ద వదలి తిరిగి ఎమ్మిగనూరు నుంచి గ్రామానికి వెళ్తున్నాడు. రాళ్లదొడ్డి సమీపంలో కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా వచ్చి ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టడంతో డ్రైవింగ్ చేస్తున్న శివకు తీవ్ర గాయాలయ్యాయి. ఆటోలో ఉన్న హేమంత్‌కుమార్ అనే బాలుడికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

- అలాగే సిరాలదొడ్డి సబ్‌స్టేషన్ వద్ద ఆర్టీసీ బస్సు మోటార్ బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో కడిమెట్ల గ్రామానికి చెందిన కిష్టప్ప తీవ్రంగా గాయపడ్డాడు. అతని కాలు విరిగింది. క్షతగాత్రుడిని చికిత్స కోసం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదంపై విచారణ చేపట్టారు.


తీవ్రంగా గాయపడిన ఆటో డ్రైవర్ శివ


గాయపడిన స్కూటరిస్టు కిష్టప్ప

ఇరువర్గాల ఘర్షణ

సి.బెళగల్: మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో గొర్రెల మంద మేత విషయంలో జరిగిన ఇరువర్గాల ఘర్షణలో మూడు బైక్‌లు దగ్ధం అయ్యాయి. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలాగున్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు కర్రెన్న, చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్‌లు. వీరిలో ఒక్కొక్కరికి ముగ్గురు కుమారులు సంతానంగా ఉన్నారు. కర్రెన్న కుమారులు తిమ్మప్ప, సోమనాయుడు, భీమనాయుడు, చిన్న వెంకటరెడ్డి కుమారులు ఈరన్న, తిమ్మప్ప, చిన్న తిమ్మప్ప, గడ్డం వెంకటేష్ కుమారులు రామంజనేయులు, తిమ్మప్ప, లక్ష్మన్నలు ఉన్నారు. వీరు ఆస్తులు, పొలం గట్లు, వ్యవసాయ బావి సాగునీటి పంపకాలు, గొర్రెల మంద మేపు విషయంలో గత కొంతకాలంగా తరచూ ఘర్షణపడుతున్నారు. ఇందులో భాగంగానే గత వారం కర్రెన్న కుమారులు సోమనాయుడు, తిమ్మప్పలపై పొలం రస్తా, గొర్రెల గడ్డి మేపు కోసం చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్ కుమారులు దాడి చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి రెండు వర్గాలకు చెందిన వారు మళ్లీ గొడవపడ్డారు. ఈ క్రమంలో చిన్న వెంకటరెడ్డి, గడ్డం వెంకటేష్‌ల కుమారులకు చెందిన మూడు బైక్‌లను కర్రెన్న కుమారులు తగలబెట్టారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ పీరయ్య పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ తెలిపారు.

పల్లెలపై ప్రత్యేక నిఘా

మంత్రాలయం రూరల్: మండల పరిధిలో అసాంఘిక, చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చర్యల్లో భాగంగా పల్లెలపై ప్రత్యేక నిఘా ఉంచాలని మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్‌రాజు మహిళా పోలీసులకు సూచించారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. స్పందనలో వచ్చే ఫిర్యాదుల పట్ల అప్రమత్తంగా ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గ్రామాల్లో కర్ణాటక మద్యం విక్రేతలపై దృష్టి పెట్టాలని సూచించారు.

ఇస్తెమాకు ఏర్పాట్లు పూర్తి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని గుడేకల్ రోడ్డులోని హరూన్ వెంచర్‌లో బుధవారం ముఖామి జమియతే అహెలేహదీస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ధార్మిక సభ (ఇస్తెమా) జరగనుంది. సభకు వచ్చే వారి కోసం అన్ని సౌకర్యాలు కల్పించినట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. సభా స్థలాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. ముస్లిం పెద్దలతో కలిసి ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ముస్లిం పెద్దలు ఎర్రకోట జగన్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఎంపీపీ గొల్ల కేశన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్, జామీయా మసీద్ ప్రెసిడెంట్ ఖాశీంబేగ్ తదితరులు ఉన్నారు.


ఇస్తెమా స్థలాన్ని సందర్శించిన ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి, ముస్లిం పెద్దలు

రోడ్లు, డివైడర్ నిర్మాణ పనులు పరిశీలన

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ రఘునాథ్ రెడ్డి మంగళవారం తనిఖీ చేశారు. డీఎస్పీ బంగ్లా రోడ్డులో జరుగుతున్న డివైడర్స్, సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులు నాణ్యతగా ఉన్నాయా? లేదా? అని తనిఖీ చేశారు. గతంలో నిర్మించిన డివైడర్స్ మధ్యలో గ్రావెల్, ఇసుక వేసి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. అలాగే తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు రోడ్డు సర్కిల్, మహబూబియా టాకీస్ వద్ద జరుగుతున్న మురుగు కాలువలు, కల్వర్టుల పనులను పర్యవేక్షించారు. కాలువలు నాణ్యతగా నిర్మించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. పనుల నాణ్యతలో రాజీ లేదన్నారు. మహబూబియా టాకీస్ ఏరియాలో ఇళ్లలోని చెత్తా చెదారాన్ని రోడ్లపై పారేయడం, రోడ్లను అపరిశుభ్రంగా ఉంచడం వల్ల ప్రజల ఆరోగ్యం హరించుకుని పోతుందన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గుర్తించి ఇంటి వద్దకు వచ్చే వాహనాలు, ట్రక్కులలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేసి పట్టణ పరిశుభ్రతకు సహకరించాలన్నారు.


డివైడర్ నిర్మాణ పనులను తనిఖీ చేస్తున్న కమిషనర్

చిలకలడోణలో పశు విజ్ఞాన బడి


పశు విజ్ఞాన బడి నిర్వహిస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: మండల పరిధిలోని చిలకలడోణ గ్రామంలో ఏపీ పశుగణాభివృధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆధ్వర్యంలో లేగదూడ ప్రదర్శన, పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ కృత్రిమ గర్భధారణలో జన్మించిన 40 ఆవు దూడలు, లేగదూడలను ప్రదర్శించారు. కృతిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువులను అభివృద్ధి చేసి పాల ఉత్పత్తి పెంపొందించి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకోవచ్చునని తెలిపారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా ఆవులు మరియు గేదెల్లో కృతిమ గర్భధారణ ద్వారా 90 శాతం పెయ్యదూడలు జన్మిస్తాయని, తద్వారా పశు గణాభివృద్ధి జరిగి రైతులకు మేలు జరగడమే గాకుండా పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. జాతీయ కృత్రిమ గర్భధారణ పథకం ద్వారా లింగ నిర్ధారిత వీర్య చూడి సూది ఖరీదు రూ.1350 ఉండగా రైతు వాటా రూ.500 భరించాల్సి ఉంటుందని రూ.850 సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు. కోసిగి సహాయ సంచాలకులు నారాయణస్వామి, మంత్రాలయం పశువైద్యాధికారి డాక్టర్ అశోక్‌కుమార్, జేవీఓ వరప్రసాద్, రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నెరవేరనున్న కల

- ముమ్మరంగా సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు
- కోసిగికి తీరనున్న తాగు, సాగునీటి కష్టాలు

కోసిగి: మండల రైతులు, ప్రజలు ఏళ్ల నుంచి ఎదురు చూస్తున్న తాగు, సాగునీటి కష్టాలు తీరనున్నాయి. కోసిగికి సమీపంలో దాదాపు 800 ఎకరాల విస్తీర్ణంలో 1.4 టీఎంసీల నీటి సామర్థ్యంతో పులికనుమ రిజర్వాయర్ నిర్మించారు. భూములు కోల్పోయిన కోసిగి ప్రాంత వాసులకు ఒక్క ఎకరాకు కూడా సాగునీరు ఇవ్వకుండా దిగువ ప్రాంతం ఎమ్మిగనూరు, గోనెగండ్ల, కోడుమూరు వరకు నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే కోసిగి ప్రాంతంలో మాత్రం భూములకు సాగునీరు అందక రైతన్నలు పొలాలను బీడుభూములుగా వదిలేసి వలస బాట పడుతున్నారు. కోసిగి ప్రాంతానికి తాగు, సాగునీటిని అందించాలని గత పాలకులకు విన్నవించుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి రైతుల కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లిఫ్ట్ ఇరిగేషన్ పథకం మంజూరు చేయించారు. దీంతో రైతుల కల సాకారం కానుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ముమ్మరంగా స్టోరేజ్ పనులు

కోసిగి గ్రామ శివారులో ఉన్న భూగేని చెరువులో 16 ఎకరాల విస్తీర్ణంలో సమ్మర్ స్టోరేజ్ పనులకు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి జనవరి 22న భూమి పూజ చేసి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే ప్రత్యేక నిధులు రూ.36 లక్షలు మంజూరు చేయడంతో నాటి నుంచి పనులు వేగంగా జరుగుతున్నాయి. పేరుకుపోయిన ముళ్ల పొదలు తొలగించడంతో పాటు పూడికతీత పనులు, కరకట్ట పనులు పూర్తి కావొచ్చాయి. అక్కడ త్వరలోనే ఫిల్టర్ బెడ్లు ఏర్పాటు చేయనున్నారు. కోసిగి సమీపంలోని పులికనుమ రిజర్వాయర్‌కు సరఫరా అయ్యే పైప్‌లైన్ వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేసి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వరకు పైప్‌లైన్ వేసేందుకు సంసిద్ధం చేశారు. మే నెలలోగా పనులు పూర్తి చేసి శాశ్వత సురక్షిత మంచి నీటిని అందించనున్నారు.


నాడు ముళ్ల పొదలతో భూగేని చెరువు


నేడు - సుందరంగా మారిన చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మాణ పనులు

కోసిగి ప్రాంతానికి సాగునీరు ఇలా..:

కోసిగి సమీపంలో పులికనుమ పైప్‌లైన్ వద్ద రూ.4.50 కోట్లతో పులికనుమ మిగులు బడ్జెట్‌తో లిఫ్ట్‌ను పద్మ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో పనులు చేసేందుకు సంసిద్ధం చేశారు. లిఫ్ట్ నుంచి 4.6 కిలో మీటర్లు కోసిగి బసవన్న కొండ ప్రాంతం మీదుగా 2.2 అడుగుల పైప్‌లైన్ ఏర్పాటు చేసి కోసిగి, పెండేకల్లు, నేలకోసిగి పొలాల్లోని నాకన్న చెరువు వరకు, చింతకుంట గ్రామాలకు దాదాపు 2500 ఎకరాలకు సాగునీటిని అందించేలా ప్రణాళిక రూపొందించారు. ఇందుకోసం ఆయా ప్రాంతాలకు భారీ సిమెంట్ పైప్‌లు వచ్చి చేరాయి. పనులు వేగవంతంగా జరుగుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురించాయి.

ఇచ్చిన మాటకు కట్టుబడి.. హామీ నెరవేర్చి

2019 ఎన్నికల ప్రచారంలో కోసిగిలో పర్యటనలో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఆయన తనయుడు వై.ధరణీధర్ రెడ్డిని కోసిగి ప్రాంత ప్రజలు, రైతులు పులికనుమ నుంచి తాగు సాగునీటి ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో గెలిపిస్తే మాట తప్పకుండా తాగు, సాగునీటి అందించాకే మీ ముందుకు వస్తామని యువనేత ధరణీధర్ రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సంబంధిత ఇరిగేషన్ అధికారులతో చర్చించి ఎత్తిపోతల పథకం మంజూరు చేయించారు. పనులను వేగవంతం చేసేలా ఎమ్మెల్యే శాయశక్తులా కృషి చేస్తున్నారు. రోజువారీగా కాంట్రాక్టర్లతో మాట్లాడి పనుల వివరాలను తెలుసుకుంటున్నారు.


నీటి సరఫరాకు సిద్ధం చేసిన పైపులు

సాగునీటి కష్టాలు తీరుతాయి



పులికనుమ రిజర్వాయర్ పక్కనే ఉన్నా ఇన్నాళ్లు సాగునీరు అందక ఇబ్బందులు పడ్డాం. ఏటా ఒకే పంట పండించుకుని బీడుగా భూములను వదిలేసి వలస వెళ్లాల్సి వచ్చేది. పులికనుమ నుంచి సాగునీరు అందితే ఏటా రెండు పంటలు పండించుకోవచ్చు. పైప్‌లైన్ పనులు వేగంగా చేయిస్తుండడం చాలా ఆనందంగా ఉంది.

– పరసాని రమేష్, రైతు

ఎమ్మెల్యే కృషి అభినందనీయం



కోసిగి ప్రాంత అభివృద్ధిపై ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. రైతుల కష్టాలను గుర్తించి ఇచ్చిన మాటకు కట్టుబడి పులికనుమ రిజర్వాయర్ నుంచి సాగు, తాగునీటిని అందించేందుకు పనులు వేగవంతంగా చేయిస్తున్నారు. పైప్‌లైన్ పనులు పూర్తయితే ఎన్నో ఏళ్లుగా రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్న కల తీరుతుంది. ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం.

– ఈరన్న, ఎంపీపీ, కోసిగి